రేవంత్ రాజకీయ హైడ్రామా!

అత్యవసరంగా ఎందుకు కూల్చారు?

- ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై రాష్ట్ర హైకోర్టు మండిపాటు
- యథాతథ స్థితిని కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ) మాదాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్‌కు నోటీసులు ఇచ్చిన గంటకే ఎలా కూల్చివేస్తారని హైడ్రాను హైకోర్టు ప్రశ్నించింది. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అంత అత్యవసరంగా ఎందుకు కూల్చివేశారని నిప్పులు చెరిగింది. ప్రభుత్వమే యథాతథస్థితిని కొనసాగించాలని ఇచ్చిన ఉత్తర్వులు ఇంకా పెండింగ్‌లో ఉండగానే ఎలా కూల్చేస్తారనే లా పాయింట్‌ను లేవనెత్తింది. కనీసం వివరణ ఇవ్వడానికి కూడా అవకాశం ఇవ్వరా అంటూ మండిపడింది. చట్ట ప్రకారం నోటీసుకు వివరణ ఇచ్చేందుకు కనీస గడువు ఉండాలి కదా? అని ప్రశ్నించింది. హైదరాబాద్ కొండాపూర్‌లోని ఎన్ కన్వెన్షన్ కూల్చివేతల వ్యవహారంలో యథాతథస్థితి కొనసాగించాలని హైకోర్టు శనివారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. కన్వెన్షన్‌ను కూల్చివేసిన హైడ్రా తీరును తీవ్రంగా ఆక్షేపించింది. శనివారం ఉదయం నోటీసులు ఇచ్చి ఆ వెంటనే ఎలా కూల్చిస్తారని మండిపడింది.

హౌస్ మోషన్ పిటిషన్

సినీ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేతను సవాలు చేస్తూ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ నల్లా ప్రీతమ్‌రెడ్డి హౌస్ మోషన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ టీ వినోద్‌కుమార్ అత్యవసరంగా విచారణ చేపట్టారు. ఎన్ కన్వెన్షన్ నిర్మాణ క్రమబద్ధీకరణ (బీఆర్ఎస్) వ్యవహారంపై ప్రభుత్వమే స్టేటస్ కో (యథాతథ స్థితి) ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ ఉత్తర్వులను ప్రభుత్వమే తిరిగి ఎలా ఉల్లంఘిస్తుందని ప్రశ్నించారు. తదుపరి ఉత్తర్వుల వరకు స్టేటస్ కో ఆదేశాలు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. ఇరుపక్షాలు యథాతథస్థితిని కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎన్ కన్వెన్షన్ చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని పిటిషనర్ న్యాయవాది కోరగా అందుకు న్యాయమూర్తి నిరాకరించారు. నోటీసులు ఇవ్వలేదని పిటిషనర్, ఇచ్చామని ప్రభుత్వం చెప్తున్నదని, అయితే నోటీసులు ఇచ్చినట్టు తగిన ఆధారాలు కూడా చూపడం లేదని, ప్రాథమికంగా దీనిపై లోతుగా విచారణ చేయాల్సిన అవసరం ఉన్నందున స్టేటస్ కో ఆదేశాలు జారీ చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రతివాదులు కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు. తమ్మిడికుంట చెరువు విస్తీర్ణం 29 ఎకరాలని అంటున్నారని, ల్యాండ్ గ్రాబింగ్ కోర్టులో చెరువు విస్తీర్ణం 26 ఎకరాలని ప్రభుత్వం చెప్పిందని, ఈ వివరాలపై పొంతన లేనందున యథాతథస్థితి ఉత్తర్వులు జారీ చేస్తున్నట్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి, నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్, హైడ్రా కమిషనర్, జీహెచ్ఎంసీ కమిషనర్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌కు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను సెప్టెంబర్ 9వ తేదీకి వాయిదా వేశారు.

ఇది హైడ్రామా: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో హైడ్రా పేరుతో హైడ్రామా నడుస్తున్నదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఏ చర్యలైనా అందరికీ సమానంగా వర్తింపచేయాలని, ఇష్టమొచ్చినట్టు చేస్తామంటే కుదరదని అన్నారు. ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై ఢిల్లీలో ఆయన స్పందిస్తూ.. గతంలో ఎలా అనుమతులు ఇచ్చారని, అక్రమ నిర్మాణాలకు రోడ్లు, విద్యుత్తు, నీటి సదుపాయం ఎలా కల్పించారని ప్రశ్నించారు.

హైకోర్టు స్టే ఎందుకు ?: రఘునందన్‌రావు

చెరువుల్లోని ఆక్రమణలను సర్వే చేసి కూలగొట్టాలని సుప్రీంకోర్టు తీర్పు ఇస్తే... ఎన్ కన్వెన్షన్‌పై హైకోర్టు స్టే ఇవ్వడమేంటని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. ఎన్ కన్వెన్షన్ కూలగొట్టడంపై ఆయన స్పందిస్తూ.. 2015లో స్టే ఇస్తే ఇప్పటివరకు ఈ కేసు ఎందుకు విచారణకు రాలేదని, ఇది ఎవరి తప్పు అని ప్రశ్నించారు. స్టే ఇచ్చే ముందు సుప్రీం కోర్టు ఆదేశాలపై హైకోర్టు జడ్జీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

అధికారులకు పూర్తి స్వేచ్ఛ
మంత్రి జూపల్లి

ప్రభుత్వ వ్యవస్థలు వాటి పని అవి చేసుకుంటూ పోతాయని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తమ ప్రభుత్వం అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందని తెలిపారు.

ఎవరిపైనా కక్ష లేదు
మంత్రి పొన్నం

ప్రభుత్వం ఎవరి మీదైనా కక్షతో, వ్యక్తిగత ద్వేషంతో, ఉద్దేశపూర్వకంగా చర్యలు తీసుకోదని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సమాజంలో పరివర్తన తెచ్చేందుకు తీసుకున్న చర్యల్లో భాగంగానే అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్నట్టు పేర్కొన్నారు.

తుమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నదంటూ హైడ్రా అధికారులు కూల్చివేసిన నాగార్జున ఎన్ కన్వెన్షన్ సెంటర్

ఎన్ కన్వెన్షన్ కూల్చివేత

- తుమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో 3.30 ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు: హైడ్రా కమిషనర్ రంగనాథ్
- స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

హైదరాబాద్ సిటీబ్యూరో/మాదాపూర్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలోని మాదాపూర్ పరిధిలో ఉన్న తెలుగు సినీ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌లోని అనధికారిక నిర్మాణాలను శనివారం హైడ్రా కూల్చేసింది. తెల్లవారుజామున పోలీసుల బందోబస్తుతో జీహెచ్ఎంసీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో, భారీ యంత్రాలతో హైడ్రా అధికారులు ఎన్ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని అక్రమ నిర్మాణాలను కూల్చేశారు. తమ్మిడికుంట చెరువుకు ఆనుకొని నిర్మించిన మరో రెండు షెడ్లను సైతం హైడ్రా కూల్చేసింది. ఎన్ కన్వెన్షన్‌లోని అక్రమ కట్టడాల కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఓ ప్రకటన విడుదల చేశారు. దానిలో పలు కీలక అంశాలను ఆయన పేర్కొన్నారు. ఖానామెట్ గ్రామ పరిధిలోని తమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్ (పుల్‌ట్యాంక్‌లెవల్) పరిధిలో ఒక ఎకరా 12 గుంటలు, బఫర్ జోన్‌లో 2.18 ఎకరాల స్థలంలో అనధికారికంగా నిర్మాణాలు చేశారని, దీనిపై ఫిర్యాదులు రావడంతో కూల్చేసినట్టు కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. 2014లో హెచ్ఎండీఏ తమ్మిడికుంట చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయగా, 2016లో ఫైనల్ నోటిఫికేషన్ విడుదల చేసినట్టు తెలిపారు. ప్రాథమిక నోటిఫికేషన్‌పై ఎన్ కన్వెన్షన్ యజమాన్యం హైకోర్టుకు వెళ్లిందని, చట్టప్రకారం నడుచుకోవాలని, ఎఫ్‌టీఎల్ నిబంధనలను పాటించాలంటూ ఆనాడు హైకోర్టు ఆర్డర్ ఇచ్చినట్టు తెలిపారు. ఆ తర్వాత ఎఫ్‌టీఎల్ సర్వే పూర్తిచేసి, ఆ నివేదికను ఎన్ కన్వెన్షన్ యజమాన్యానికి అధికారులు అందించారని తెలిపారు. అనంతరం కన్వెన్షన్ యజమాన్యం మియాపూర్ అదనపు జిల్లా జడ్జి కోర్టును ఆశ్రయించిందని, ఈ కేసు ఆ కోర్టులో పెండింగ్‌లో ఉన్నదని తెలిపారు. ఇది తప్పా.. ఏ కోర్టు కూడా స్టే ఆర్డర్లు ఇవ్వలేదని హైడ్రా కమిషనర్ వెల్లడించారు.

జీహెచ్ఎంసీ అనుమతులు లేవు

ఎన్ కన్వెన్షన్ యజమాన్యం నిబంధనలు ఉల్లంఘించి 3.30 ఎకరాల్లో చేపట్టిన అనధికార నిర్మాణాలకు జీహెచ్ఎంసీ ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. ఇదే యజమాన్యం బిల్డింగ్ రెగ్యులరైజ్ స్కీమ్ (బీఆర్ఎస్)లోనూ తమ నిర్మాణాల రెగ్యులరైజ్‌కు ప్రయత్నించగా, అది తిరస్కరణకు గురయ్యిందని పేర్కొన్నారు. తమ్మిడికుంట చెరువుకు మాదాపూర్ పరిసర ప్రాంతాల్లోని నాలాలు అనుసంధానమై ఉన్నాయని, హైటెక్ సిటీ ప్రాంతంలో వరదనీరు నిలిచే సమస్య తీవ్రంగా ఉన్నదని తెలిపారు. ఒక పక్క చెరువు కబ్జాకు గురికావడంతో చెరువులో నీటి నిల్వ సామర్థ్యం 50 నుంచి 60 శాతం వరకు కుచించుకుపోయిందని, దీంతో భారీ వర్షాలు పడిన సమయంలో తమ్మిడికుంట చెరువు దిగువన ఉన్న ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, పేద, మధ్య తరగతి కుటుంబాల ఇండ్లు నీటిలో మునిగిపోతూ తీవ్ర ఆస్తి నష్టానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే నిర్ణీత ప్రక్రియను అనుసరించి నీటిపారుదల, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ శాఖల అధికారులతో కలిసి తమ్మిడికుంట చెరువులో అనధికారిక నిర్మాణాలను పూర్తిగా కూల్చివేశామని రంగనాథ్ చెప్పారు. తెలంగాణ హైకోర్టు శనివారం మధ్యాహ్నం ఈ కూల్చివేతలపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఎన్ కన్వెన్షన్ కూల్చివేత ఘటనతో వచ్చే నెల వరకు వివాహ, ఇతర ఫంక్షన్ల నిర్వహణకు ఎన్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌ను బుక్ చేసుకున్న నిర్వాహకులు ఆందోళనలో పడ్డారు. ఇప్పటికే ఆహ్వాన పత్రికలు అందజేసిన వారు మరో ఫంక్షన్‌హాల్ కోసం వెతుకులాటలో పడ్డారు.

అంగుళం భూమినీ ఆక్రమించలేదు!

- కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా కూల్చివేతలు
- నోటీసులివ్వకుండా కూల్చడం బాధాకరం
- తీర్పు వ్యతిరేకంగా వస్తే నేనే కూల్చివేసేవాడిని
- ఎన్ కన్వెన్షన్ కూల్చివేతపై సినీనటుడు నాగార్జున

హైదరాబాద్, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ): కోర్టు నుంచి స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ దానికి విరుద్ధంగా ఎన్ కన్వెన్షన్ కట్టడాలను కూల్చివేయడం బాధాకరమని ఎన్ కన్వెన్షన్ యజమాని, సినీ నటుడు అక్కినేని నాగార్జున ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చర్య పూర్తిగా చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. అది పూర్తిగా ప్రైవేటు భూమి అని, అంగుళం కూడా చెరువు భూమిని తాము ఆక్రమించలేదని స్పష్టం చేశారు. తాజా పరిణామాల వల్ల తాము ఆక్రమణలు చేశామని, తప్పుడు నిర్మాణాలు చేపట్టామని ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉన్నదని, ఆ అభిప్రాయాన్ని పోగొట్టాలనేదే తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ మేరకు ఎన్ కన్వెన్షన్ కూల్చివేత చర్యపై ఆయన ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఈ నిర్మాణ కూల్చివేత కోసం గతంలో ఇచ్చిన అక్రమ నోటీసుపై కోర్టు స్టే కూడా మంజూరు చేసిందని తెలిపారు. అయినా అధికారులు పట్టించుకోకుండా చట్టవిరుద్ధంగా కూల్చివేతలు చేపట్టారని మండిపడ్డారు. కూల్చివేతకు ముందు తమకు ఎలాంటి నోటీసు కూడా జారీ చేయలేదని తెలిపారు. చట్టాన్ని గౌరవించే పౌరుడిగా, ఒకవేళ కోర్టు తనకు వ్యతిరేకంగా తీర్పునిస్తే తానే స్వయంగా నిర్మాణాలను కూల్చివేసేవాడినని తెలిపారు. కానీ ఓ వైపు కోర్టులో కేసు నడుస్తుండగా, మరోవైపు స్టే ఉండగా అధికారులు చేసిన ఈ చట్ట విరుద్ధ చర్యలకు వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. కోర్టులో తమకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామని పేర్కొన్నారు.

హైడ్రా పరిధి విస్తరణ!

111 జీవో పరిధి గ్రామాల వరకు వర్తింపు

నేడో, రేపో ఆర్డినెన్స్

అందుకోసమే అసెంబ్లీ ప్రోరోగ్!

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా) పరిధిని ప్రభుత్వం విస్తరించనున్నదా? అంటే తాజా పరిణామాలు అవుననే అంటున్నాయి. హైడ్రా పరిధిని 111 జీవో పరిధి గ్రామాల వరకు వర్తింపజేయనున్నట్టు తెలుస్తున్నది. దీనికోసం నేడో, రేపో ఆర్డినెన్స్ కూడా జారీ చేసే అవకాశాలున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఆర్డినెన్స్ జారీ చేసేందుకే అసెంబ్లీని ప్రోరోగ్ చేసినట్టు తెలుస్తున్నది. దీంతో 111 జీవో పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి ఉమ్మడి రాష్ట్రంలో హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జంట జలాశయాల పరివాహక ప్రాంతాల్లోని 84 గ్రామాల్లో నిర్మాణాలపై ఆంక్షలు విధిస్తూ 111 జీవోను తీసుకొచ్చారు. జీవో వల్ల ఆ పల్లెలన్నీ బఫర్ జోన్‌లోకి వెళ్లాయి. అయితే, గత బీఆర్ఎస్ సర్కారు ఆ జీవోను రద్దుచేసి అక్కడి ప్రజలకు స్వాంతన చేకూర్చింది. ఫలితంగా ఆ ప్రాంతాల్లో భూముల రేట్లు కూడా పెరిగాయి, క్రయవిక్రయాలు జోరందుకొని నిర్మాణాలు వెలిశాయి. అయితే, ఇప్పుడు ఈ 84 గ్రామాలకు హైడ్రా పరిధిని వర్తింపజేస్తే ప్రస్తుతం ఏర్పాటైన నిర్మాణాల సంగతి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతున్నది.

చట్టప్రకారమే కూల్చివేతలు: భట్టి

హైదరాబాద్, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగర పరిధిలో చట్టప్రకారమే హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఢిల్లీలో ఉన్న ఆయన తాజాగా ఎన్ కన్వెన్షన్ కట్టడాల కూల్చివేతపై స్పందించారు. బఫర్ జోన్‌లో మాత్రమే కాదని, ఏకంగా చెరువుల్లోనే నిర్మాణాలు చేపట్టారని, వాటిని కూల్చేస్తున్నామని తెలిపారు. హైడ్రా చేసే ప్రతి పనికీ నోటీసులు ఇచ్చిన తర్వాతే చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. హైడ్రా ఏర్పాటును ప్రజలందరూ ఆహ్వానిస్తున్నారని చెప్పారు.

తెలంగాణలో బుల్డోజర్ రాజ్యం!

- అక్రమం అంటూ రాత్రికి రాత్రే కూల్చివేతలు
- వాదన వినిపించే సమయమివ్వని అధికారులు
- కోర్టుకెళ్లే లోపే సమస్తం నేలమట్టం
- కూల్చివేతలు పూర్తయ్యేదాకా అధికారుల ఫోన్లు స్విచ్ఛాఫ్

హైదరాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ): దొంగరాత్రి నిర్మాణాల మీదికి వస్తున్న బుల్డోజర్లు.. ఇంట్లో ఉన్నవారు బయటకు వచ్చి చూసే లోపే ప్రహరీగోడలను తొక్కుకుంటూ ఇండ్ల మీదికి వస్తున్న భారీ పొక్లెయినర్లు.. నగర శివార్లలో ఇప్పుడు ఇవే భీతావహ దృశ్యాలు ఆ ప్రాంత నివాసులలో భయోత్పాతాన్ని సృష్టిస్తున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ దమనకాండ ఉత్తరప్రదేశ్‌లో రాజ్యమేలుతున్న బుల్డోజర్ల సంస్కృతిని గుర్తుకు తెస్తున్నదని నగరవాసులు అంటున్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం బాటలోనే తెలంగాణ ప్రభుత్వం కూడా నడుస్తున్నదని అభిప్రాయపడుతున్నారు. గడిచిన నెల రోజులుగా అక్రమ నిర్మాణాల కూల్చివేత పేరుతో ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఏకపక్షంగా ఉంటున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. అక్రమార్కుల భరతం పట్టే విషయం ఎలా ఉన్నా.. ఆ పేరుతో అరాచక పాలనకు తెరతీస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కనీసం నోటీసు ఇవ్వకపోవడం.. బాధితుల వాదన వినకపోవడం.. న్యాయం కోసం కోర్టును సంప్రదించే సమయం కూడా ఇవ్వకపోవడం.. కనీసం ఇంట్లో సామాన్లన్నా బయటకు తెచ్చుకొనే సమయం ఇవ్వకుండా అధికారులు అరాచకంగా వ్యవహరిస్తున్న వైనంపై ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. హైడ్రా అధికారులు రాత్రికి రాత్రి వచ్చి లోపల ఉన్నవారిని అందరినీ బయటకు వెళ్లగొట్టి కూల్చివేతలు ప్రారంభిస్తున్నారు. ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, విలువైన ఫర్నిచర్.. ఇలా వస్తువులన్నింటినీ ధ్వంసం చేస్తున్నారు. విద్యా సంస్థల నిర్మాణాలపై కూడా చర్యలు తీసుకుంటున్నారు. విద్యాసంవత్సరం మధ్యలో ఉద్దేశపూర్వకంగా తరగతి గదులనూ కూల్చే ప్రయత్నం చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

న్యాయస్థానాలకు వెళ్లకుండా..దొంగరాత్రే..

హైడ్రా పేరుతో నగరంలో గత నెల రోజులుగా సాగుతున్న కూల్చివేతలను గమనిస్తే.. అంతా ఓ పథకం ప్రకారం, అర్ధరాత్రి లేదా తెల్లవారుజామునే పనిని ప్రారంభిస్తున్నట్టు స్పష్టమవుతున్నది. లేదా సెలవు రోజు తెల్లవారు జామున కూల్చివేతలను చేపడుతున్నారు. ఉదయం పది గంటలలోపే తమ టార్గెట్‌ను నేలమట్టం చేసేస్తున్నారు. బాధితులకు న్యాయపరమైన ఊరట లభించకుండా ఉండేందుకే వ్యూహాత్మకంగా తమ కూల్చివేతలను చేపడుతున్నట్టు తెలుస్తున్నది. ఒకవేళ నోటీసులు ఇచ్చి, పనిదినాల్లో, పనివేళల్లో నిర్మాణాలను కూల్చేందుకు వెళ్తే యజమానులు అలర్ట్‌గా ఉంటారని, వారు అప్పటికప్పుడు తమ బాధను న్యాయస్థానానికి చెప్పుకునే అవకాశం లభిస్తుందని, ఉన్నతాధికారులతో లేదా ఇతరులతో ఫోన్లు చేయించి తమ పనిని అడ్డుకుంటారని, ఆ అవకాశం ఇవ్వకుండా ఉండేందుకే అర్ధరాత్రి లేదా తెల్లవారుజామున, సెలవు దినాల్లో కూల్చివేతలు చేపడుతున్నట్టు చెప్పుకుంటున్నారు. బాధితులు కోర్టులకు వెళ్లి తమ గోడును వెళ్లబోసుకునే లోపే వారి ఆస్తులను నేలమట్టం చేస్తున్నారు. బాధితులు తాము నిరపరాధులమని, తమ వద్ద అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయని చెప్పుకునేలోపే అంతా ముగించేస్తున్నారు.

ఫోన్లు స్విచ్ఛాఫ్

హైడ్రా చేస్తున్న నిర్మాణాల కూల్చివేతలో మరో ప్రధానమైన అంశం అధికారులు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకోవడం. ఏ నంబరులో అందుబాటులో ఉన్నారో ఎవ్వరికీ చెప్పకపోవడం.. కమిషనర్ మొదలు అధికారులందరూ ఫోన్లు బంద్ చేసుకుంటున్నారు. కూల్చాల్సిన నిర్మాణాల వివరాలను ఇచ్చి కింది స్థాయి సిబ్బందిని మాత్రమే పంపిస్తున్నారు. ఒకవేళ అధికారుల ఫోన్లు అందుబాటులో ఉన్నా.. ఎవరి ఫోన్లు ఎత్తడంలేదన్న ఆరోపణలున్నాయి.

బుల్డోజర్ రాజకీయమేనా?

ఉత్తర్‌ప్రదేశ్ తరహాలో తెలంగాణలో కూడా ప్రత్యర్థులను భయపెట్టేందుకు బుల్డోజర్లతో రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కేవలం ప్రత్యర్థిపార్టీని, ఆ పార్టీకి అనుకూలంగా ఉండే వర్గాలను టార్గెట్ చేసేందుకే ఈ తరహా కూల్చివేతలు జరుగుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హైడ్రా అన్నది ఉత్త హైడ్రామా అని, అసలు ఉద్దేశం వేరే ఉన్నదన్న అభిప్రాయాలు వస్తున్నాయి.

సినీ పెద్దలు కలవలేదనే కక్ష !

ఎన్ కన్వెన్షన్‌పై మంత్రి ఫిర్యాదు

3 రోజుల్లోనే హైడ్రా నేలమట్టం

కోమటిరెడ్డికి దూరంగా సినీ పెద్దలు

లెక్క తేలుస్తానని ఆనాడే వార్నింగ్

హైదరాబాద్, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ)/హైదరాబాద్ సిటీబ్యూరో/మొయినాబాద్: సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి సినీ పెద్దలు కోపం తెప్పించారా? మంత్రికి, సినీ పెద్దలకు మధ్య దూరం పెరిగిందా? అందరి లెక్కలు తేలుస్తానన్న మంత్రి అన్నంత పనీ చేశారా ? అంటే ప్రస్తుత పరిణామాలు నిజమే కాబోలు అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సినిమాటోగ్రఫీ మంత్రిగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తరువాత తెలుగు సినీ రంగానికి చెందిన పెద్దలు ఆయన్ను కలవలేదు, అభినందించలేదు. దీంతో మంత్రి కోమటిరెడ్డి అసహనానికి గురైనట్టు ప్రచారం జరిగింది. తనను దిల్‌రాజు మినహా ఇంకెవరూ అభినందించలేదని ఆప్పుడే తన ఆగ్రహాన్ని వ్యక్తంచేశారు. తాజాగా వారం క్రితం కూడా కూల్చివేతలపై హింట్ ఇచ్చారు. ఆక్రమణలను కూల్చివేస్తామని, ఇందులో ఎంత పెద్దవారున్నా, సినీ ప్రముఖులున్నా వదిలిపెట్టబోమని ప్రెస్ మీట్‌లో ప్రకటించారు. చెప్పినట్టుగానే సినీ నటుడు నా గార్జునకు సంబంధించిన ఎన్ కన్వెన్షన్‌పై ఈనెల 21న సినిమాటోగ్రఫి మం త్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 24న హైడ్రా ఎన్ కన్వెన్షన్‌ను నేలమట్టం చేసింది. అంటే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫిర్యాదు చేసిన రోజుల వ్యవధిలోనే హైడ్రా శరవేగంగా తన పని పూర్తి చేయడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాడు సినీ పెద్దలు మంత్రిని కలవకపోడమే నేడు కూల్చివేతలకు దారి తీసిందనే అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

జీవో 111లో ఒక్కటీ కూల్చనియ్యం

జీవో 111 పరిధిలో ఏ ఒక్క నిర్మాణాన్నీ కూల్చనీయమని, ఒక్క నిర్మాణం కూల్చివేసినా పూర్తి బాధ్యత తనదేనని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. హిమాయత్‌నగర్ గ్రామ రెవెన్యూ పరిధిలో ఒక రెస్టారెంట్ ప్రారంభోత్సవానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామన భీమ్‌భరత్‌తో కలిసి వచ్చారు. జీవో 111 పరిధిలో నిర్మాణాలను కూల్చివేస్తున్నారని స్థానిక నేతలు చెప్పడంతో మంత్రి స్పందించారు. ఆ నిర్మాణాల జోలికి వెళ్లొద్దని అధికారులను ఆదేశించాలని సీఎంను కోరినట్టు చెప్పారు.

హైడ్రా కూల్చేసిన హిమాయత్‌నగర్ పరిధిలో ఉన్న కావేరి సీడ్స్ కంపెనీ భవనం

హైడ్రా చూపు ఒక వైపేనా?

కూల్చివేతల్లో కనిపించని పారదర్శక విధానం

- పరిధి దాటి కావేరీ సీడ్స్ భవనం కూల్చివేత
- ఎన్ కన్వెన్షన్‌పై మంత్రి ఫిర్యాదు..మూడ్రోజుల్లోనే నేలమట్టం
- అనురాగ్ యూనివర్సిటీ భవనాలపై నీటిపారుదల శాఖ ఫిర్యాదు
- కాంగ్రెస్ నేతల అక్రమ నిర్మాణాలపై పడని హైడ్రా పంజా

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధానప్రతినిధి, ఆగస్టు 24(నమస్తే తెలంగాణ): హైడ్రా.. ఇప్పుడు రాష్ట్రంలో ప్రధాన చర్చనీయాంశం. ఆరంభంలో ఆదర్శంగా అనిపించిన ఈ ఏజెన్సీ అడుగులు క్రమేణా వివాదాస్పదంగా మారుతున్నాయి. కూల్చివేతలను ఎవరూ తప్పు పట్టడంలేదు. కానీ ఎంపికలోనే అసలు మర్మం దాగి ఉందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ముఖ్యంగా రాజకీయ కక్షసాధింపులకు హైడ్రా పావుగా మారుతుందనే విమర్శలకు నానాటికీ బలం చేకూరుతుంది.

హైడ్రా పరిధి ఎక్కడి వరకు ?

హైడ్రా కూల్చివేతల పర్వంలో భాగంగా గండిపేట ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలని వేసిన అడుగులు అనుమానాల నిప్పును రాజేశాయి. వాస్తవానికి గత నెల 19న ప్రభుత్వం హైడ్రాకు సంబంధించిన ఉత్తర్వుల్లో స్పష్టంగా ఔటర్‌ను పరిధిగా నిర్ధారించి, గ్రామాల పేర్లు సహా పొందుపరిచింది. కానీ హైడ్రా యంత్రాంగం ఔటర్ రింగు రోడ్డు దాటి.. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ గ్రామ పరిధిలో ఉన్న కావేరీ సీడ్స్ కంపెనీ భవనాన్ని కూల్చివేసింది. అదేమంటే.. గండిపేట ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నందున కూల్చివేసినట్టు స్పష్టం చేసింది. పరిధిదాటి ఎందుకు పోయారనే దానిపై నేటికీ స్పష్టత కరువు. తాజాగా శనివారం సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను నేలమట్టం చేశారు. దీనిపై ఈ నెల 21న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఎఫ్‌టీఎల్‌లో నిర్మించినందున కూల్చివేసినట్టు ఆధారాలతో హై డ్రా ప్రకటన చేసింది. కానీ ఎన్ కన్వెన్షన్‌పై నీటిపారుదల శాఖ చెరువులో కబ్జా అయినట్టుగా ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపురం పరిధిలోని నాదం చెరువు బఫర్‌జోన్‌లో నిర్మాణాలు ఉన్నాయని అనురాగ్ యూనివర్సిటీ భవన సముదాయంపై నీటిపారుదల అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడ తమ్మిడికుంట వ్యవహారంలో రాష్ట్ర మంత్రి ఫిర్యాదు చేస్తే, ఇక్కడ నాదం చెరువుకు సంబంధించి నీటిపారుదల శాఖ ఫిర్యాదు చేసింది. ఇందులో ఒకరు సినీ ప్రముఖుడు కాగా... మరొకరు ప్రతిపక్ష బీఆర్ఎస్ శాసనసభ్యుడు. దీంతో హైడ్రా అడుగులు ఎటువైపు పడుతున్నాయనేది సుస్పష్టం. ఆరోపణల నేపథ్యంలో కాంగ్రెస్ నేత అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తే హైడ్రా ప్రతిష్ఠ పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

'బుల్డోజర్ న్యాయం' అనాగరికం